# చిన్న కథ

# లచ్చిమి



ఎండ మండి పోతోంది.

చెక్కబండి మీద ఏసేబుకు దాహం వేసింది.

''లచ్చిమీ! నీళ్ళియ్యి'' అన్నాడు.

బండి లాగుతున్న లచ్చిమి, అతి కష్టంతో చెక్కబండిని రోడ్డు పక్కన గానుగ చెట్టు నీడకు లాగింది.

లచ్చిమికి పదేళ్ళు వుండొచ్చు. సన్నగా బక్కపలచగా వుంటుంది. మాసి చిరిగిన గౌను, చెమటతో తడిసిపోయింది. చిన్నప్పటి నుంచి ఏసోబు దగ్గరే వుంటోంది. అమ్మ, నాన్నలను చూడలేదు. ఆ వేళ పొద్దున్నుంచి ఇడ్లీ కూడా తినకపోవటంతో ఆకలిగా వుంది. పైగా ఎండలో బండి లాగటంతో, నీరసం. కుష్ఠురోగం, వాడి కాలి, చేతి వేళ్ళు తినేసినా, ఏసేబు బరువే. ఆ వేళ మంగళారం మార్కెట్టులో నాలుగు రూపాయలు దొరుకుతాయని ఏసోబు ఆశ.

రోడ్డు పక్కన చేతి పంపు. లచ్చిమి, చెక్కబండి లోంచి ప్లాస్టిక్ డొక్కు నిండా నీళ్ళు పట్టింది. తను తాగి ఏసేబుకు అందించింది. ''ఇడ్డెన్ను తింటావా?'' అన్నాడు ఏసేబు.

లచ్చిమి ఎప్పుడూ ఏమీ అడగదు. ఏసేబు కొంటే తింటుంది. ''పాక ఒటేలు, కాడికి పోనియ్యి'' అన్నాడు. మళ్ళీ బండి లాగటం ప్రారంభమైంది. మంగళారం మార్కెట్టుకు చుట్టుపక్కల ఊళ్ళనుంచి సైకిళ్ళు, కూరగాయల బళ్ళు, అమ్మకానికి సరుకులతో చేరుకొంటున్నాయి. ఒటేలులో అంతగా జనం లేకపోయినా, ఏసేబును, ఎవ్వరూ పట్టించుకోరు. సీవండి గిన్నెలోంచి నాలుగు రూపాయి బిళ్ళలు లెక్కెట్టి లచ్చిమి చేతికిచ్చాడు. రోజూ అలవాటుగా వెళ్ళి అక్కడ రొచ్చు గుంట పక్కన నిలబడింది. ఒటేలు క్లీనర్ వచ్చి డబ్బులు తీసుకొని కౌంటర్‌లో యిచ్చి రెండు పొట్లాలు తెచ్చి యిచ్చాడు.

రోజూ రెండు చక్రాల చెక్కబండి మీద కూచుని ఏసోబు కుష్ఠురోగం తినేసిన మొండి చేతులతో దణ్ణం పెట్టి అడుక్కొంటుంటాడు. ముక్కూ, నోరూ ఒకటైనట్టు వాడి మొహం చూట్టానికి కూడా జనం యిష్టపడరు. కొరకంచు లాంటి కాళ్ళు, పుళ్ళూపడి ఈగలు పీక్కు తింటుంటాయి. పుళ్ళ చుట్టూ కట్టిన గుడ్డ పీలికల్లోంచి ఎర్రటి రక్తం మరకల తడి, ఎండ పొడకు మెరుస్తుంది. కుష్ఠువ్యాధి నర నరాల జీర్ణించటంతో వాడి కళ్ళు కూడా సరిగ్గా కనపడవు. లచ్చిమి, ఏసోబులు ఒకరిపై ఒకరు ఆధారపడి బతకటం తప్ప వారి మధ్య బాంధవ్యం లేదు. ఏసోబు, బండి నడిచినంత సేపు ''కుష్ఠోన్ని ధర్మం బాబూ! అమ్మా! అయ్యా!'' అంటుంటాడు. లచ్చిమి డ్యూటీ చెక్కబండి లాగటమే. ఆమె ఎప్పుడూ చెయ్యి కూడా చాచదు. వాడు అడుక్కొంటుంటే పట్టించుకోదు. తాను గొంతు కలపదు. ఏసోబుకు తెలుసు. జాలి, దయ కొందరు చూపించినా, ఎక్కువమంది తనను వదిలించుకోవటానికి డబ్బులు గిన్నెలో పడేస్తారు. తన కుష్ఠురోగమే తనకు యింత అన్నం పెడ్తోంది. రోగం తగ్గితే తనకు బతుకు లేదు. లెప్రసీ తగ్గించే మందులు మింగడు.

ఏసోబుకు, లచ్చిమి సర్వస్వం. పసికందుగా వున్నప్పటి నుంచి తానే ఆ పేరుపెట్టి పెంచాడు. చెక్కబండి లాగగలిగినప్పటి నుంచి పావలాలు కాకుండా సత్తుగిన్నెలో అర్ధలు, రూపాయలు పడుతున్నాయి. లచ్చిమికి ఏలోటూ రాకూడదని వాడి తాపత్రయం. ''ఎంతో మంది ఆ పిల్లను అమ్ముతావా? మాకు యిచ్చేయి. మేం చదువు చెప్పిస్తాం. నీకు రోగం. నువ్వేం చేయగలవు'' అన్నారు. ఆశలు చూపించారు. ఆ అమ్మాయికి కూడా కుష్ఠు వస్తుందని నయానా, భయానా ఒప్పించటానికి ప్రయత్నం చేసారు. అయినా ఏసోబు లొంగలేదు. కాని ఆ పిల్లకు వయస్సు పెరిగే కొద్దీ వాడికి భయం పట్టుకొంది. ఎవ్వరైనా ఎత్తుకు పోతారేమో. కొంపలకి అమ్మేస్తారేమో వాడికి అదే బెంగ. లచ్చిమి ఎవరితోనైనా మాట్లాడినా, ఎవరైనా ఆ అమ్మాయి ఊసు ఎత్తినా సహించలేడు. అందరి కళ్ళు ఆ పిల్ల మీదే. ''కుష్ఠు పోడి దగ్గర బంగారం లాంటి మా లచ్చిమి'' అంటుంటుంది అడుక్కొనే మంగమ్మ.

మున్సిపాలిటీలో మార్కెట్ షెడ్ రేకులు విరిగి పాడుపడిన నీడలో అడుక్కొనేవాళ్ళు, నలుగురైదుగురు కుష్ఠు రోగ బాధితులు వుంటుంటారు. పై కప్పులోంచి ఎండా, వానా అప్పుడప్పుడు వెన్నెల పడుతూంటూంది. పగలంతా చెక్కబండి లాగి అలసి సొలసి, ఏసోబు యిచ్చిన డబ్బులతో తిని లచ్చిమి ఆదమరిచి నిద్రపోతూంటూంది. ఆ పిల్ల మొహం చూస్తూ తాను గొప్పింటి పిల్ల అనుకొంటాడు. తన రోగిష్టి బతుకు లచ్చిమికి రాకూడదు. లచ్చిమిని తన మొండి చేతులతో అసలు ముట్టుకోడు. కుష్ఠు, లచ్చిమికి ఎక్కడ అంటుకుందోనని వాడి భయం.

మంగమ్మ ఆ అడుక్కొనే కుటుంబాలలో మాటకారి. అందరితో చనువుగా వుంటుంది. వయస్సులో వున్నప్పుడు వ్యాపారం చేసేది. స్టేషన్ రోడ్డులో వున్నప్పుడు బేరాలు బాగా తగినావి. నారిగాడు తోడుగా వుండేవాడు. క్రమేపీ సుఖరోగాలు తగిలి, ఆకర్షణ తగ్గి అడుక్కోవటం మొదలెట్టింది. నారిగాడు ఒకప్పుడు రిక్షా తొక్కేవాడు. వాడు చేయని పాడుపని లేదు. దొంగతనాలు, మోసాలు, అమ్మాయిలను తార్చడాలు, కంపెనీల చుట్టూ తిరుగుతుంటాడు. నిరుపేద కుటుంబాలు, దిక్కులేని పిల్లలను ఆసరాగా నటిస్తూ వ్యభిచారంలోకి దింపుతుంటాడు.

నారిగాడు కళ్ళు ఎప్పుడూ లచ్చిమిపైనే. మంగమ్మతో గుసగుస లాడుతుంటాడు. యింకా చిన్నపిల్ల అంటుంది. మున్సిపాలిటీ రేకుల కొంపలలోకి చావురోగాలతో పాటు ఎయిడ్స్ ప్రవేశించింది. ఏసోబుకు మరింత భయం పట్టుకొంది.

లచ్చిమి మొఖంలో కొత్త కళాకాంతులు. లోకం తెలియని ఆ అమ్మాయిని అందరూ పలకరిస్తుంటారు. ఆప్యాయత నటిస్తుంటారు. నారిగాడు మరీను. లచ్చిమి మాట్టాడదు. నవ్వదు. దేనికీ ఆశపడకపోవటం. నారిగాడు ఆటలు సాగటం లేదు.

ఆ రోజు ఆకాశంలో నల్లటి మేఘాలు. చినుకులు చిన్నవిగా మొదలై వర్షం ప్రారంభమైంది. ముసురుతో గాలి. రెండు రోజుల నుంచి ఏసోబుకు జ్వరం. మూలుగుతున్నాడు. మంగమ్మ మందు బిళ్ళలట్టుకొచ్చింది. లచ్చిమి, టీ బండి కాడికెళ్ళి టీ తెచ్చి యిచ్చింది. ఆ పిల్లకు ఏం చేయాలో తెలియటం లేదు. ఏసోబును చూస్తే కన్నీళ్ళు ఆగటం లేదు. మంగమ్మ పరవాలేదంటూ లచ్చిమని అక్కున చేర్చుకొంది... వెక్కి వెక్కి ఏడుస్తూనే నిద్రలోకి జారుకొంది.

నారిగాడు జేబు కొట్టేసిన డబ్బుతో తాగి వచ్చాడు. రేకుల షెడ్‌లో పైనుంచి వాననీళ్ళు కారుతున్నాయి. తలుపులు లేకపోవటం వీధి లైటు పడుతోంది. లచ్చిమి ఒక మూలగా చలికి వణుకుతూ మగత నిద్రపోతోంది. ఏసోబు కళ్ళు తెరిచేటప్పటికి, నారిగాడు తూలుతూ లచ్చిమి మీద పడుతున్నాడు. ఏసేబుకు ఎక్కడ లేని ఓపిక వచ్చింది. చెక్కబండి చక్రం లాగి వాడి మీద విసిరాడు. నారిగాడి బుర్ర పగిలింది. రక్తం ధారగా వాన నీళ్ళతో కలుస్తోంది. వాడి కేకలు విని మంగమ్మ పరుగున వచ్చింది. వాన్ని గవర్నమెంటు ఆసుపత్రికి మోసుకుపోయారు.

మర్నాడు తాహసిల్దార్ గారు లచ్చిమిని ప్రభుత్వ బాలికల శరణాలయంలో చేర్పించారు.

–జయసూర్య